శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీ కీ జై!

అన్నిటికీ మూలం....


# గురుకృప

విజయదశమి సంచిక 2010



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి..

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ
కుహరంలోని నిశ్శబ్ధ నిశీథిలో ప్రతిధ్వనించాలి.
ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి.
ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా
నిరంతరం వర్షించాలి! ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ
ఆ జ్ఞాన సౌరభాల మత్తులో ఆనందంగా నర్తిస్తూ
**"సాయివంటి దైవంబు లేడోయి లేడోయి"**
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి! అదే నా ఆశ,
ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం. ఆ స్వప్న సాఫల్యం
కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో, ఆర్ద్రతతో ప్రార్థించడమే
మనం చేయగలిగింది, చేయవలసింది.






"గురువుకు పగ్గాలు అప్పగించి నిశ్చింతగా ఊరక కూర్చుంటే చాలు!
చేయవలసినదంతా నేను చేసి మిమ్ములను చివరికంటా గమ్యం చేరుస్తాను"
అన్న శ్రీ సాయి ఉపదేశం ఆయన బోధనాసారం.

\- సాయిభక్తి సాధన రహస్యం.

సంపుటి : 13
అక్టోబర్ 17

సంచిక : 4
2010

# గురుకృప



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీ బాబూజీ



## లోపలి పేజీలలో

ఉన్నమాట - అనుకున్నమాట 4
- గురుకృప

గురువు-శిష్యుడు 6
- గురుకృప

స్వాములవారి దయ 8
- జగద్గురు బోధలు

తాకిన చూపు-మారిన రూపు 11
- మునిబాబు

హాయిలోన మనస్సు నిలుపు 12
- పార్థసారథి ప్రవచనాల నుండి

దిగంబరదాసు 16
- గురుకృప

నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**

GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01.
Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.



## ఉన్నమాట-అనుకున్నమాట

ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రకు తలమానికమైన వారు శ్రీసాయిబాబా. మనిషి క్రమంగా దైవస్వరూపునిగా మారడమే శ్రీసాయిబాబా ప్రవచించిన మతం. శ్రీసాయి అవతార కార్యంలో ప్రస్ఫుటంగా గోచరించేది ఏమంటే ఇహములోనే పరమును చూపుతూ మానవులకు సత్యమైన, శుభ్రమైన మార్గాన్ని విశదపరచడము, అందుకు తానే తన బిడ్డల స్థాయికి దిగివచ్చి, వారిని చేయి పుచ్చుకు నడిపించి, చివరికంటా గమ్యమునకు చేర్చడము. అవ్యాజమైన ఆయన కరుణ, ప్రేమ జన్మజన్మలుగా మనలను ఉద్ధరిస్తూ తరింపచేస్తోంది. ఆ కోవలోనే శ్రీసాయి మనకందించిన గురువనే వరము ***'పూజ్య శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ'***. ఆ మహితాత్ముని ఆచరణాత్మక జీవిత విధానము, వారి జీవనమున ఆదర్శమనే పుష్పమునుండి వెలువడే ఓ మహత్తర సౌరభమును ఆస్వాదించవలసిదే కాని, అలతి పదాలలో అక్షరీకరణ చేయలేనిది. సాయిని సాయిగా చూపే ఆ సద్గురు పీఠమున, నిత్య ఆచరణీయములెన్నో, అనుక్షణము స్మరించవలసిన విషయములెన్నో!

కేవలం 'భక్తి' అనే మాట – మాటలకే పరిమితమై పోతున్న రోజులలో 'భక్తి' పేరున వ్యవస్థలో జరుగుతున్న వ్యర్ధ ఆచారాలను, తంతును, మూఢనమ్మకాలను తూర్పారబట్టి, స్వచ్ఛమైన శ్రీ సాయిబాటను అందరికీ రాచబాటగా అందించిన ఒక గొప్ప 'భక్తి' విప్లవకారుడుగా శ్రీవారిని వర్ణించుట అతిశయోక్తి కాదు. పూజ్య గురుదేవుల సన్నిధి భక్తికి కొలువు, జ్ఞానమునకు నెలవు. శ్రీసాయి సాంప్రదాయమును దండముగా ధరించి, మానవాళి శ్రేయస్సుకై ఇలకు దిగివచ్చిన సమ్యమీంద్రుడాయన.

శ్రీవారి జీవన విధానమే మనకు నిజమైన బోధ. మానవులు–వ్యక్తులకు కాక ఆదర్శములకు అంకితమయి, వారి జీవన గమనమున సత్ప్రవర్తనను, సత్యపథమును ఆశ్రయించి, సాయిని స్మరించుకుంటూ తద్వారా ఆనందంగా జీవించడమే నిజమైన ఆధ్యాత్మికగా అభివర్ణిస్తారు ఆ సాయి తపస్వి. సత్యమున ఆధ్యాత్మికత భౌతిక జీవనముకు ఆటంకము కాదు. వ్యక్తి యొక్క వికాసమును కాంక్షించుచూ, సర్వమానవ శ్రేయస్సుకు తోడ్పడు అపురూప ధర్మ కెరటము – ఆధ్యాత్మికత. మనిషి మనిషిలో పేరుకొని పోయిన సంకుచిత భావాలను దునిమి, వసుధైక కుటుంబపు సంస్కారము కలిగి, భగవత్కృపను అనుభూతం చేసుకోగల మానసిక సౌందర్యాన్ని అందించగలిగిన గొప్ప తత్త్వము – ఆధ్యాత్మికత. మానవాళి జీవనశైలిని ప్రశాంతతతో, విశ్వాసముతో, సమర్ధతతో నింపుతూ, వర్తమానమును క్రమబద్ధీకరించగల అనుపమాన మార్గము – ఆధ్యాత్మికత. ఒక్కమాటలో చెప్పాలంటే ***ఆచరిస్తే వచ్చే జ్ఞానము ఆధ్యాత్మికత.*** అట్టి గొప్ప సంస్కృతికి భరత వర్షమును పుట్టినిల్లుగా చెప్పవచ్చు. ఆధ్యాత్మికత





యనగా అది కేవలం ప్రార్ధనా మందిరమునకు పరిమితమన్న ఆలోచనల నుంచి మనిషి నిత్యనైమిత్తిక కర్మలలోని అణువణువునా ఆధ్యాత్మికత ఇమిడియున్నదని తమ సామాన్య జీవన విధానము ద్వారా విశదపరిచినారు శ్రీసాయి వంటి మహాత్ములు.

కేవలం కొన్ని ఘడియలకు లేదా కొన్ని గంటలకు పరిమితమైన ధ్యానము నొనరించి దానికి భక్తియనో, మరొక నామధేయమునో పిలువలేదు భారత సంస్కృతి. నిత్య నైమిత్తిక కార్యములలోని ప్రతీ ఒక కార్యమును తృష్ణతోను, సృజనాత్మకతతోను, చేసుకుపోతూ స్వధర్మములో వసిస్తూ, పరిపూర్ణతను సాధించే ప్రక్రియగా ఆధ్యాత్మికతను రూపుదిద్దారు సంతులు. మనిషి ఎదుర్కొనే ప్రతి సంఘటనను దైవ దత్తముగా స్వీకరించి, చేయవలసిన కర్తవ్యమును దైవారాధనగా చేసుకొనిననాడు మానవ జీవితము నిత్య కళ్యాణము, పచ్చతోరణమే కదా! నిక్కమున మహాత్ముల పథమే అది. వారి దైనందిన కార్యములు గమనించిన వారు చేసెడి ప్రతి చిన్న కార్యము కూడా, “ఆ కార్యమే వారి ప్రాణమా” అన్నట్లు దర్శనమిచ్చును. ఆ కార్యము ముగిసిన పిమ్మట మరల వారిలోని భగవదనుభూతిని మనము దర్శించవచ్చును. కార్య కారణములతో సంబంధము లేక వారి జీవనములోని ప్రతీ క్షణమున ప్రతి కార్యమునందున ‘భగవత్కృప’ ఒక నేపథ్య సంగీతము వలె సాగుచుండును. అట్టి నేపథ్య సంగీతపు శృతిని, గతిని మన బ్రతుకున ఒక చక్కటి ఆకృతిగా మలచుకొనవలెనన్న మన నిత్య జీవిత విధానమును చక్కదిద్దుకొనవలెనన్నది నిర్వివాదాంశము.

శ్రీసాయిసమర్ధుని చెంత జరిగిన ప్రతి దినమును మనము గమనించిన యెడల మనమెటుల వసించవలెనో మనకు దిశా నిర్దేశమగును. నాటి సాయి భక్తుల జీవన శైలిలో స్వాధ్యాయమునకున్న ప్రాధాన్యత నేటి (అ)నాగరిక సమాజమున కనబడదు. స్వాధ్యాయమును, సంతుల చరితామృత పానమును, భగవద్ధ్యానమును వీడిన జాతి ప్రగతి పథమున పరిఢవిల్లుట అసాధ్యము. నాటి భక్తుల జీవితములలోని ప్రతి అంకము సాయితో ముడిపడినవే. బిడ్డల విద్యా విషయాక పరిస్థితుల మొదలు ఉద్యోగిగా వారి ఫించను నిర్ణయము వరకు ఇహమైనా, పరమైనా ప్రతి సంఘటన సాయిదత్తమే. భక్తుల కష్ట, సుఖములన్నీ సాయి అనుగ్రహకారకములే!

> “నిత్య జీవితమున సంతుల పథమున మెలగవలెనన్న మనము అందుకునే పొగడ్తలకు సద్గురువును ఆధారముగా నెరిగి, మనకు లభించు పరుష వాక్యములను సద్గురుని బోధగా, శిక్షణగా భావించవలె. శ్రీసాయికి బిడ్డలుగా వెలగవలె! మన సాటి వారి యెడల ప్రేమ, సమత, మమతలను కలిగి యుండవలె. మనలో ఇంకను మిగిలిన ఆ(నా)చార కాండకు స్వస్తి వాక్యము పలుకవలె!





ఆధునిక జీవనమున విశృంఖలమవుతున్న కులాల కుళ్లును సాయిచంద్రుని కరుణతో కడుగవలె! మతమౌఢ్యమున మంటగలయుచున్న మానవత్వము, శ్రీసాయిప్రేమతో క్రొత్త చిగురులు తొడగవలె! పరనిందకు పాల్పడక జగతి ప్రగతికి హేతువుగా సాగే భాషణముగా మన భాషను చక్కదిద్దుకోవలె. క్షణకాలమైననూ వృధా చేయక త్రికరణాలను సత్యమే తానైన సాయి ధ్యాస, ఊసులతో గడపవలె. నేటి మొదలు మనలో దాగిన మహిష తత్త్వమును (చెడు భావములను) నెరిగి, సద్గురు అనుగ్రహమనే చురకత్తితో అట్టి తత్త్వమునకు సరియైన సమాధాన మిచ్చి దుష్టసీమల ఉల్లంఘున మొనర్చవలె. సద్గురు ప్రేమ సీమల అడుగిడి పరిపూర్ణతను సాదించవలె! నేటి నుండి ఇదియే మన లక్ష్యము. సర్వేజనా సుఖినోభవంతు! శుభం భవతు! సద్గురు దర్శన, చరణ సేవన ప్రాప్తిరస్తు!! – ***గురుకృప***

## గురువు-శిష్యుడు

***గురువు ఎలా దొరుకుతాడు?***

గురువు నీకు దొరకడమనేది సాధ్యమయ్యే పని కాదు. గురువు మనల్ని స్వీకరిస్తాడు తప్ప మనము అతనిని ఎంచుకోలేము. ఫలానా వారు నా గురువు అని నీవు నిర్ణయించగలిగావంటే అతనికన్నా నీవే ఎక్కువన్న మాట. ఇంక అతను నీకు గురువు ఎలా అవుతాడు? గురువులకు మార్కులు వేస్తున్నాం. ఎంతటి సాహసం! మనకు తెలియకుండానే మనను స్వీకరించి మనకు కనబడకుండానే మనను నడిపిస్తూ అవసరమైనవేళ, ఆవశ్యకత ఏర్పడిన వేళ, మనకు శరీరంతో సాక్షాత్కరిస్తాడు గురువు.

ఈ విషయాన్ని గురించి ఒక పరమగురువు ఇలా చెప్పారు "నేను కొండమీద ఉన్నాను, కొండచుట్టూ పల్లెలో మీరందరూ ఉన్నారు. ఈ పల్లెలో ఎవరింటిలోని దీపం ఎంతెంత కాంతిని ప్రసరింపచేస్తున్నదో నాకు కనబడుతూ ఉంటుంది. ఇన్ని దీపాలను చూస్తున్న నన్ను మాత్రం మీరు చూడలేరు. నేను కనబడదలిస్తే తప్ప".

***ఎలాంటివాడు గురువు?***

నీ నుండి ఏమైనా ఆశించేవాడు నీకు గురువుకాలేడు, నీపైన ఆధారపడినవాడు నీకు గురువుకాడు, తనను, తన నమ్మకాలను, విశ్వాసాలను నీపైన రుద్దేవాడు నీకు గురువుకాడు. గుర్తింపును కోరేవాడు నీకు గురువుకాడు. నీనుండి ఏమీ కోరనివాడు, నీ శ్రేయస్సు తెలిసి, నిన్ను నిష్కామంగా నడిపించేవాడు, నిన్ను తనంతవానిగా తీర్చిదిద్దేవాడు గురువు. ఒక అయస్కాంతం తన సాన్నిధ్యంచేత మరో ఇనుపముక్కను అయస్కాంతంగా చేస్తోంది. అయస్కాంతం ఇనుపముక్కలోని ఏ భాగాన్నీ తొలగించడం లేదు. తనలోని ఏ భాగాన్ని ఇనుప ముక్కలోనికి చొప్పించడం లేదు. ఇనుపముక్కలో





ఆర్ద్రతను పెంచకుండా చేసే ఉపకారం – అది అపకారమే అవుతుంది.



నిగూఢంగా ఉన్న అయస్కాంత ధర్మాన్ని తన సాన్నిధ్య మహిమ చేత మేల్కొలుపుతున్నాడు. గురువు కూడా అంతే. మనలోని మానవ చైతన్యాన్ని, తన సాన్నిధ్యాన్ని ప్రసాదించడం ద్వారా దివ్యత్వంలోనికి మేల్కొలుపుతున్నాడు. ***నిద్రిస్తున్న దైవాన్ని మేల్కొలిపే మేల్కొన్న దేవుడు గురువు.***

***గురువు చేస్తున్నదేమిటి?***

లాంతరు అక్కడ ఉన్నది. దానికి గ్లాసుకూడా తుడిచిపెట్టబడి ఉన్నది. దాని ప్రక్కనే అగ్గిపెట్టె, ఆ అగ్గిపెట్టె పైన అగ్గిపుల్ల అన్నీ సిద్ధంగా ఉన్నాయి. గురువు వచ్చి అగ్గిపుల్లను గీసి, దీపాన్ని వెలిగిస్తున్నాడు. సామగ్రీ, సాధనా, అంతా శిష్యుడిదే. దానిని వెలిగేటట్టు అనుగ్రహిస్తున్నవాడే గురువు.

***సద్గురు సాన్నిధ్యం***

సూర్యునికీ, పద్మానికీ ఎంత దూరం? కాని సూర్యుడు ఉదయించగానే పద్మం వికసిస్తోంది. దీనినే సాన్నిధ్యం ప్రసాదించడం అంటారు. గురువుకు ఎంత దూరంలో ఉన్నా శిష్యుడు గురువును స్మరించడం ద్వారా ఆయన సాన్నిధ్యాన్ని పొంది విప్పారగలడు. ఇంకో గమ్మత్తు చూశారా, పద్మం వికసించే పద్ధతిలో ఒక రమ్యత, ఒక సామ్యము ఉన్నది. అన్ని వైపులకూ సమానంగా ఏకకాలంలో వికసిస్తోందది. అలాగే సద్గురువు సాన్నిధ్యాన్ని పొందిన శిష్యుని హృదయం కూడా పరిపూర్ణమైన వికాసాన్ని పొందుతుంది.

***శిష్యుడు – కోడిగ్రుడ్డు***

కోడిపెట్ట తన గ్రుడ్డును పొదగడం వంటిదే గురువు శిష్యుని తీర్చిదిద్దడం. కోడిపెట్ట గ్రుడ్డుకు ఒక విధమైన వెచ్చదనాన్ని అనుగ్రహించినట్టు, గురువు శిష్యునిపై తన సాన్నిధ్యాన్ని అనుగ్రహిస్తున్నాడు. గ్రుడ్డులోని పిల్ల రూపుకట్టుకున్నట్టు శిష్యుడులోని మానవుడు దివ్యునిగా రూపుదిద్దుకుంటున్నాడు. తయారైన పిల్ల, పై డొప్పను తన ముక్కుతో తానే చిట్లగొట్టి విశాల ప్రపంచంలోనికి అడుగుపెట్టినట్టు, దివ్యత్వాన్ని పొందిన శిష్యుడు తన బంధాలను తానే కరగించుకొని, అంతర్యామిలోనికి అడుగు పెడుతున్నాడు. ఈ అడుగు పెట్టడాన్నే దివ్యత్వాన్ని పొందడం అంటారు.

కోడిపిల్ల తయారయ్యేంత వరకు చుట్టూ ఉన్న తెల్లడొప్ప దానికి రక్షణ. తయారైన తరువాత అదే అడ్డమై పిల్ల దానిని చిట్లగొట్టి బయటకు వస్తుంది. అలాగే సామాన్యస్థితిలో ఉన్న మానవుడు బ్రతికి బట్టకట్టడానికి మమకారాలు ఆశలు మొదలైనవి కారణాలు, దివ్యత్వాన్ని పొందిన తరువాత అవే కరిగిపోవలసిన బంధాలవుతున్నాయి. పిల్ల తయారవగా డొప్పను చిట్లగొట్టుకొని, లీలగా బయటకి వచ్చినట్టే శిష్యుడు కూడా దివ్యత్వాన్ని పొంది లీలగా తన బంధాలను కరగించుకుంటాడు.





*శిష్యుడు - మజ్జిగచుక్క*

కాగి చల్లారుతున్న పాలలో మజ్జిగచుక్క తోడు వేస్తున్నాం. మరుసటి రోజుకది చక్కగా తోడుకుంటుంది. ఆ తరువాత కవ్వంతో చిలికితే పెరుగులో లీనమై ఉన్న వెన్నంతా పైకి తేలుతుంది. ఆ వెన్నను ముద్ద చేస్తున్నాం. ఆ వెన్నముద్ద మజ్జిగలో మూడువంతులు మునిగి, ఒకవంతు తేలుతూ ఉంటుంది. ఇప్పుడు మనమెంత కలిపినా వెన్న తిరిగి మజ్జిగలో కలవడమంటూ ఉండదు. అలాగే ఆవేశకావేషాలతో కాగి కాగి క్రమంగా దైవం కొరకు అన్వేషించగా చల్లారుతున్న శిష్యుని మనస్సులో గురునివాక్కు మజ్జిగచుక్కై తోడవుతుంది. ఆపైన క్రమంగా పాలు పెరుగైనట్టు, శిష్యుని మనస్సు నిశ్చలత్వాన్ని పొందుతుంది. ఆపైన సత్కర్మాచరణ అనే చిలకడం ద్వారా అనుభూతి అనేది వెన్నగా పైకి తేలుతోంది. ఇలా వెన్నగా రూపొందిన శిష్యుడు-వెన్న మజ్జిగలో తేలుతూ మజ్జిగకు మంచి రుచి ఇచ్చినట్టు, తన చుట్టూ ఉన్న ప్రపంచంలోనే ఉంటూ ఈ ప్రపంచానికి ఆనందానుభూతిని ప్రసారం చేసే కేంద్రంగా రూపొందుతాడు. అంటే తయారైన ఈ మజ్జిగ ఇంకెన్ని పాలకుండలకైనా తోడుగా పనికి వస్తుందన్నమాట. వెన్న ఎంత పిసికినా మజ్జిగలో కలవనట్టు,ఎలాంటి స్థితిగతులెదురైనా ఇతడు పూర్వపు స్థితులలోనికి జారిపోవడం అంటూ ఉండదు. చివరకు ముక్తజీవి అయిన శిష్యుడు శరీరాన్ని కాలదన్నడు, పరిసరాలను కాదనడు, తన శరీరానికి, పరిసరాలకు కూడా ధన్యత చేకూర్చగలడు. *-గురుకృప*

## స్వాములవారి దయ

శాస్త్రములు దేవుడిని ప్రేమస్వరూపి అని పేర్కొంటున్నది. అటువంటి ప్రేమ స్వరూపమే శివస్వరూపమని తిరుమూలనయనారు వాక్కు. కోపతాపములతో మనం సాధించలేని దానిని, ప్రేమతో ఒక చిటికెలో సాధించవచ్చు. శ్రీకంచికామకోటి పీఠాన్ని అలంకరించిన చంద్రశేఖరులు అట్టి దయతో కూడిన ప్రేమ స్వరూపులు. ఆ ప్రేమ వారి ముఖంలో అణువణువులోనూ వ్యక్తమవుతూ ఉంటుంది. ఆయన మాటలు, చేతలు ఈ ప్రేమ యొక్క ఛాయలే. పెద్దలను చూచినా, పిన్నలను చూచినా, సంపన్నులను చూచినా, దరిద్రులను చూచినా, పండితుడిని చూచినా, పామరుడిని చూచినా ఆయన ప్రేమ స్రవంతిలో ఏ మాత్రపు ఒడిదుడుకులు కాని, అసమత్వం కాని ఉండదు. శ్రీవారికి విసుగులేదు, అలసట లేదు, విరామం లేదు. వారికి ఆర్తత్రాణమే ఒక దీక్ష. 'అభయం సర్వభూతేభ్యః' అనటమే వారి మహావాక్యం.

ఒక రోజు ఈ సంఘటన మాంబలంలో జరిగింది. రాత్రి పన్నెండు గంటలు. ఆచార్యుల వారు నన్ను పిలిపించి చాలసేపు ముచ్చటించినారు. మత గ్రంథములలోని సూక్ష్మతత్త్వములన్నీ, అలవోకగా వివరించినారు. కాలం గడిచేది తెలియక, ఆనందంగా వారి సమక్షంలో వారి





మాటలు వింటూ మైమరచి వుండిపోయాను. ఈ విధంగా సంభాషణ తెల్లవారుఝామున ఐదుగంటలదాకా సాగింది. తరువాత స్వాములవారు దండకమండలములు రెంటినీ తీసుకొని బయలుదేరినారు. వారు వెళుతుంటే, ధర్మదేవతయే నడచి వెళుతున్నట్లు అనిపించింది.

త్రోవలో, ఒక స్త్రీ ఒక యువతిని, చంటిబిడ్డనూ తీసుకొని ఆచార్యులవారి ముందుకు వచ్చింది. రాత్రంతా నిద్ర మేల్కొని కాలాతీతమైన కాలంలో, శ్రీవారిని దర్శించడానికి, తన గోడు చెప్పకోవడానికి వచ్చిన ఆ స్త్రీని చూచి నాకు కోపం వచ్చింది. "స్వాములవారికి విశ్రాంతి ఏమీ అవసరం లేదా?" అని ఆమెతో అన్నాను. ఆమె నా మాటను వినిపించుకోలేదు. తనతో వచ్చిన యువతిని నమస్కరించమని చెప్పి, స్వామివారితో మాట్లాడసాగింది. నేను మరలా ఆక్షేపించగా, "ఉదయం ఏడు గంటలకు ప్రసవించిన తన కుమార్తె, ఎక్స్‌ప్రెస్ బండిలో వెళుతున్నందున స్వామివారి ఆశీర్వాదం కోసం తాను వచ్చానని, అందుకే శ్రమ ఇస్తున్నానని" ఆమె నిదానంగా చెప్పింది. నేను కోపంగా మాట్లాడడం, ఆమె పట్టుదలగా నమస్కరించి, తన పనిని తాను చూసుకోవడం స్వాములవారు చిరునవ్వుతో చూస్తూ ఉన్నారు. తర్వాత నన్నే ప్రసాదం తెమ్మని, నా ప్రతిబంధం లేకుండా ఆయన ఏకాంతంగా అనుగ్రహించడానికి దారి చూసుకున్నారు. నేను ప్రసాదం తెచ్చేలోపుగా ఆమె అన్నీ వివరించింది. స్వాములవారు ఓర్పుతో విన్నారు. ఆమె ప్రశాంతంగా ప్రసాదం అందుకొని వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిన తరువాత శ్రీవారు ఇలా అన్నారు "భగవంతుని ముందు తమతమ బాధలు చెప్పుకుంటే బాధానివృత్తి అవుతుందని ప్రజలలో నమ్మకం ఉన్నది. కానీ, ప్రజలకు ఈ భగవత్సాన్నిధ్యం దొరకడం లేదు. నాలో ఈ సాన్నిధ్యం వున్నదని నమ్మి అమాయకంగా వచ్చి, భగవంతుడికి నివేదించినట్లు తమ బాధలను నివేదించి, తృప్తితో వీళ్లంతా వెళుతున్నారు. వారి నమ్మకాన్ని నేనెందుకు చెడగొట్టాలి? నేను ఉండడం దేనికి? ప్రజలు తమ బాధలు చెప్పుకుంటే వినడానికే కదా? దానివలన ఈ శరీరానికి శ్రమ అయినా, బలం తగ్గినా కొదవలేదు. నన్ను ప్రజలు నమస్కరిస్తున్నారంటే దానిలో నాకు గొప్ప లేదు. ప్రజలలో ఈ మాత్రమైనా నమ్మకం ఉన్నదే! భగవచ్చింతన ఉన్నదేయని నాకు సంతోషంగా ఉంది. అందుచేత ఈ కార్యంలో ఎవరూ అడ్డు రాకుండుటే మంచిది". మరొక్కసారి విళ్ళుపురమునకు సమీపంలో ఉన్న అధిష్ఠానానికి వెళ్లుతూ మార్గమధ్యంలో దర్శనం కోసం వేచియున్న హరిజనులు, ఆడమగ చేతులు జోడించుకొని నిలుచుని ఉండగా, చూచి వారిలో పెద్దలైన వారిని పిలిచి కుశల ప్రశ్నలు వేసి అనుగ్రహించారు. భగవంతుడే తమ్ములను అనుగ్రహించినట్లు ఆ అమాయక జనం ఆనంద భాష్పాంచితులయ్యారు. అపుడు స్వాముల వారు "నేను పల్లకిలో వెళ్లి వుంటే ఈ జనుల దైవ చింతననూ, భక్తినీ ఎలా తెలుసుకోగలను? వీళ్లందరూ తమతమ ధర్మాన్ని తాము పాలిస్తూ వుండడం నేను తెలుసుకోవడానికే





ఈ సందర్భం భగవంతుడు అనుగ్రహించాడు” అన్నారు. వేద ప్రతిష్ఠాపనంలో ఆచార్యుల వారికి అమితమైన శ్రద్ధ, స్వదేశ సంస్థానాలు ఉన్నపుడు వేదాధ్యయనపరులకు ఆదరణ ఉండేది. ఇపుడు అది అంతరించి పోయింది. వేదాధ్యయనం ప్రోత్సహించడానికి క్రొత్తగా కొందరికైనా వేదం నేర్పాలని శ్రీవారికి ఆకాంక్ష. వేదాధ్యయనం చేసిన వారికి బహూకృతులు ఇవ్వాలని వారి అభిప్రాయం. ఒకరోజు ఒక స్త్రీ సంపన్నురాలు వచ్చి నమస్కరించింది. స్వాములవారు ఆమెను, “నీవు నాకు నూరు సవరలను ఇవ్వగలవా? వేదాధ్యయనం చేసిన వారికి స్వర్ణకుండలాలు ఇవ్వవలెనని అభిప్రాయం. ఏమంటావు?” అని అన్నారు. ఆమె తన కంఠంలో వున్న బంగారు గొలుసును వెంటనే తీసి ఇచ్చింది. అంతేకాక, రెండు వారాలలో నూరు సవరలు సంపాదించి తెచ్చి ఇచ్చింది.

ఇలయాత్తం గుడిలో స్వాములవారు వున్నపుడు విద్యుత్ సదస్సు జరిగింది. మతంలో విశ్వాసం కల్గించడం, కళలను ప్రోత్సహించడం, ఇదీ సదస్సు యొక్క ఉద్దేశ్యం. ఒకరోజు సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 12 గం॥ల వరకు స్వాములవారు ఈ సదస్సు గూర్చిన ఏర్పాట్లు వివరించసాగారు. అపుడు ద్రవ్యం గూర్చి ప్రస్తావన వచ్చింది. స్వాములవారు అన్నారు ***“డబ్బును గూర్చి చింతించడం మనపని కాదు. సదస్సు ఎట్లా నడవడం అనేదే ఇప్పటి ప్రశ్న. దానిని మనం నిర్ణయిస్తే, దానికి కావలసిన ద్రవ్యం మాట చంద్రమౌళీశ్వరుడే చూసుకుంటాడు.”*** విద్వత్సదస్సు మహా వైభవంగా జరిగింది. ఇలాంటి సదస్సే నారాయణపురంలోను జరిగింది. సదస్సు కార్యక్రమం స్వాములవారు నిర్ణయించారు. దానికి కావలసిన ఆర్థిక పథకం చంద్రమౌళీశ్వరుడే చూసుకున్నాడు.

***– జగద్గురు బోధలు***

“ఒక్క క్షణకాలమైనా వ్యర్థం చేయరాదు. దినములో కనీసం కొన్ని నిముషాలైనా ఒకచోట స్థిరంగా కూర్చుని భగవద్ధ్యానం చేయాలి. హృదయం భగవన్నివాసమని గమనించక, దురాలోచనలతో నింపి, దుర్గంధభూయిష్ఠం చేసి ఆయనకు స్వదేశంలో చోటులేనట్లు చేశాం మనం. అందుచే ఆయనను మళ్లా ఆహ్వానించి, ఆయన సింహాసనంలో ఆయనను ఉపవిష్ఠుని చేసి, మనం ఆయన సాన్నిధ్యంలో కూచోవాలి. కనీసం అరగంట సేపయినా భగవచ్చరణ స్మరణ చేసే అలవాటు చేసుకోవాలి. నియతిగా ఆహారం ఎట్లు గ్రహిస్తున్నామో, ధ్యానమనే ఆహారాన్ని దానితోపాటు గ్రహించాలి. అది ఈశ్వరానుగ్రహానికి అనుకూలిస్తుంది. ద్రవ్యార్జనకై ఎంతకాలం వినియోగిస్తున్నాం? అరగంట సేపు ఆత్మలాభంకోసం మనం వినియోగించకూడదా? ధ్యానం అభ్యాసమయిన మనిషికి సత్కార్యాచరణం సహజమైపోతుంది” - శ్రీ చంద్రశేఖర సరస్వతీ స్వామి





అందుకోవాలేగాని ఉపదేశం అన్ని వైపుల నుండి అందుతూనే ఉంటుంది



# తాకిన చూపు-మారిన రూపు

నా పేరు పట్నం మునిబాబు. గురువుగారు నాకు ఎన్నో సమస్యలు తీర్చారు. తోటి గురుబంధువులతో పంచుకోవాలన్న ఆశతో ఈ అనుభవం పంపుతున్నాను. నాకు పెళ్లి అయిన దగ్గర నుండి ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ వచ్చాను. ముఖ్యంగా నా భార్య సుగుణకు ఆరోగ్యం సరిగా లేదు. మెంటల్‌గా ఆమె చాలా డిప్రెషన్‌కు లోనైంది. ఎక్కడో చూస్తుంటుంది. మనం ఏం చెప్పామో పట్టించుకోదు. చాలా సన్నగా అయిపోయింది. ఇలాంటి పరిస్థితులలో మా వీధిలో ఒకరి ఇంటి వద్ద సాయిబాబా సత్సంగం ఏర్పడింది. నా భార్యకు నెల్లూరులో సైకాలజిస్ట్ వద్ద ట్రీట్‌మెంట్ ఇప్పించాము. చాలామందులు వాడినా తగ్గలేదు. కొంతమంది దెయ్యం పట్టిందన్నారు. భూత వైద్యులకు చూపించాము. తగ్గలేదు. నేను నా భార్య ఆరోగ్యం గురించి బెంగపెట్టుకున్నాను. మా వీధిలో మా మామ వాళ్ల ఇంటి వద్ద జరుగు సాయిబాబా సత్సంగానికి భజనకు వెళుతూ, వచ్చాము. తక్కువ కాలములోనే మాకు శిరిడీకి వెళ్లి గురువుగారి దర్శనం చేసుకునే అవకాశం కలిగింది. గురుబంధువు రెడ్డి వెళ్లి డాక్టర్ గోపాలకృష్ణను తీసుకువచ్చి నా భార్య ఆరోగ్యం గురించి చూపెట్టడం జరిగింది. శిరిడీకి ఎలాగూ వెళ్తున్నారు కదా ఈమెను కూడా తీసుకు వెళ్లండి, గురువుగారి దర్శనంతో బాగవుతుంది. మనం ట్రీట్‌మెంట్ చేసే కేసు కాదు, ఈమెను తప్పకుండా శిరిడీకి తీసుకువెళ్లండని చెప్పారు. కొట్టెంవీధిలోని వారికి గురువుగారు రాత్రి ఒంటి గంటకు దర్శనమిచ్చారు. నేను, నా భార్య ఆరోగ్య పరిస్థితిని చూసి మమ్మల్ని ముందుగా పంపారు. ఆ మహానుభావుని ముందు నిలుచున్నాము. నా భార్యను నేను గురువుగారికి నమస్కారము చేసుకోమన్నాను. ఆమె నమస్కారం చేసుకోకుండా ఉంది. మన మాట ఆలకించే పరిస్థితిలో లేదు. గురువుగారు మా మాటల్ని వింటున్నారు. ఒక్కసారి ఆయన తల పైకెత్తి ఆమె వంక చూసారు. ఆ దెబ్బతో ఆమె గురువుగారి పాదములకు నమస్కారం చేసుకొంది. నేను గురువుగారికి నా భార్య అనారోగ్య పరిస్థితిని గురించి చెప్పాను. గురువుగారు బాబా ఊదీ ప్యాకెట్ ఒకటి ఇచ్చి భయం లేదు, వాడండని చెప్పారు. బాబా చూసుకొంటారు అని చెప్పారు. నేను క్యూలో నుండి బయటకు వచ్చిన తరువాత నాకు ఒక సందేహం వచ్చింది. డాక్టర్స్‌కి చూపించాలా వద్దా అని. మా తమ్ముడు క్యూలో నిలబడి ఉన్నాడు. వాడిని గురువుగారిని అడగమని చెప్పాను. అతడు గురువుగారిని మా వదినను డాక్టర్స్‌కి చూపించాలా అని అడిగితే గురువుగారు అవసరం లేదని చెప్పారట. శిరిడీ నుంచి వచ్చిన తరువాత గురువుగారు ప్రసాదించిన ఊదీ వాడిన తరువాత ఆరోగ్యం కుదుట పడింది. ఇప్పుడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంది. రోజూ మందిరమునకు వెళు తుంది. –మునిబాబు







## మంచిమార్పు - సద్గురు కూర్పు

పూజ్య గురుదేవుల పాదపద్మములకు నమస్కరించి వ్రాయు లీల. మాది నెల్లూరిజిల్లా వెంకటగిరి. నాపేరు మునిరాజు. మేము ముగ్గురం అన్నదమ్ములం. మా చివరి తమ్ముడు కృష్ణ ఆత్మహత్య చేసుకోవాలని విషం తీసుకున్నాడు. మా ఊరిలో ట్రీట్‌మెంట్ చేసాం. కాని పరిస్థితి విషమించింది. నెల్లూరుకి తీసుకు వెళ్లమని డాక్టర్ చెప్పారు. గ్యారంటీ లేదని చెప్పారు. నేను రెండవరోజు వెంకటగిరికి వచ్చి బాబా మందిరానికి వెళ్లి బాబా–గురువుగార్లను పూజించుకున్నాను. మా తమ్ముడికి చెడు అలవాట్లు ఉండేవి. వాడు మరలా చెడు అలవాట్లలోనే ఉంటే వాడిని బతికించవద్దు. మంచివాడిగా మారితే వాడిని బ్రతికించండి అని బాబాను ప్రార్థించాను. ఆరోజు మందిరంలో భజన, సత్సంగము, ఆరతి జరిగినది. అప్పుడు నాకు ఆరతి జరుగుచున్న సమయంలో బాబా లీలగా అలా కనిపించి, మీ ఇంటి బీరువాలో ఊదీ ఉంది, దానిని మీ తమ్ముడి నుదిటన పెట్టి కొంచెం నీటిలో కలిపి, నోట్లో వెయ్యి, ఏమీ భయంలేదు అని చెప్పిన మాటలు వినిపించాయి. నేను వెంటనే బాబా మాటలు వినబడినట్లుగా, వెళ్లి బీరువాలో వెతికాను. విచిత్రంగా బాబా ఊదీ పొట్లం ఒకటే ఉంది. అది అసలు వున్న విషయం అద్భుతం అనిపించి, మామయ్య నెల్లూరుకు పోతుంటే ఆ ఊదీ ప్యాకెట్ ఇచ్చి, ఈ విషయం ఏమీ చెప్పకుండా, ఈ ఊదీ వాడండని నేను తరువాత వస్తానని చెప్పి పంపాను. ఆ ఊదీ వాడినప్పటి నుండి త్వగా ఎంత త్వరగా అంటే మా తమ్ముడు కోలుకొని ఐదవ రోజుకే డిశ్చార్జి అయి, వెంకటగిరి వచ్చాడు. అప్పటి నుండి లక్షణంగా పని చేసుకుంటున్నాడు.

*– పి. మునిరాజు, వెంకటగిరి*

## హాయిలోన మనస్సు నిలుపు

మనః ప్రసాద స్సౌమ్యత్వం మౌన మాత్మ వినిగ్రహః

భావసంశుద్ధి రిత్యేత త్తపో మానసముచ్యతే॥

మనస్సు తనకు తాను నిరంతరమయిన హాయిని అనుభవిస్తూ, తోటివారి యెడల సౌమ్యంగా వర్తించగలగాలి! కాని, వాటి యెడల మౌనం వహించాలి. ఇంద్రియాలను అలవోకగా తనలోనికి స్వీకరించగలిగినదై ఉండాలి. పవిత్రమైన భావాలతో తేలియాడుతూ ఉండాలి. మనస్సు ఇలా తపస్సు చేయాలి! ప్రతి చిన్న దానికి చిరాకుపడే వారుంటారు. చికాకుపడుతూ, చిర్రుబుర్రులాడుతుంటారు, నిష్టూరుస్తారు, విషాద వదనాన్ని పెడతారు. ఇన్ని కష్టాలు ఇంకెవరికీ లేవు. పగవారికి కూడా ఇలాంటి జీవితం వద్దు, అనుకుంటూ ఉంటారు. ఇలా అనుకోవడంలో ఒకానొక సంతృప్తిని పొందజూస్తారు. అలాకాక మనస్సును ప్రసన్నంగా ఉంచుకోవడం చేతకావాలి. హాయిగా ఉ





తెలిసి ఆచరిస్తే అవి క్రతువులవుతాయి, యథాలాపంగా ఆచరిస్తే అవి తంతులవుతాయి.

ఉడటాన్ని అభ్యసించాలి. హాయిగా ఉన్నప్పుడే ఎటువంటి కార్యాలనైనా మనస్సు సాధించగలదు. నిత్య జీవితంలో జరిగే ప్రతి చిన్న అంశము మన హాయిని చెదరగొడుతుంది. అంటే ఏమనుకోవాలి? ప్రతి చిన్న అంశానికీ కృంగిపోవడమే! ఇది కూడనిపని, ఎటువంటి అంశమైనప్పటికి మన స్థితి నుండి జారకుండా ఆనందాన్ని సాధించగలగాలి, సన్నివేశపు తాకిడికి మనస్సు హాయిని కోల్పోవడం జరుగకూడదు, హాయిని కోల్పోయిన తరువాత మనస్సు సాధించగలిగినది లేదు. మనం మోయగలిగినదైతే బరువుకాదు – మోయలేనిది మనకు సాధ్యం కాదు. నిజానికి సమస్యలున్నాయా? లేవు. మనం తట్టుకొంటే అది సన్నివేశమంటున్నాం. మనం తట్టుకోలేకపోతే అదే సన్నివేశాన్ని సమస్య అంటున్నాం. మనం హాయిని కోల్పోయిన వేళ సన్నివేశం సమస్యగా మనకు గోచరిస్తుంది. గమనించండి! కనుక తట్టుకోవడంలో ఒడుపును చూపాలి. సన్నివేశాలే గాని, సమస్యలు లేవని మనకు స్పష్టం కావాలి. మనస్సు హాయిని కోల్పోకుండా, స్థాయిని కోల్పోకుండా ముందుకు సాగడమన్నది మనకు అభ్యాసం కావాలి. అది మన స్వభావం కావాలి!

తోటివారి యెడల వ్యవహరించేటపుడు సౌమ్యంగా ప్రవర్తించాలి. అంటే వారిని అర్థం చేసుకునేటందుకు ప్రయత్నించాలి. వారిలోని తప్పులు పట్టడం, వారిని అనాదరించడం తగ్గాలి. అలా జరిగినపుడు తోటివారు మానసికంగా ఎంతో బాధపడతారు అన్నది మనకు తెలియాలి. సౌమ్యంగా ఎలా తెలియచెప్పాలో మనం అభ్యసించాలి. అలాగే తోటివారిని గూర్చి కానివి ఊహించకూడదు, పుకార్లు మొదలయినవి తొందరపడి నమ్మకూడదు, వారిని చిన్నచూపు చూడకూడదు, కొంతమంది ఎదుటివారు ఎక్కడ దొరుకుతారా, తప్పులెంచడానికి అని చూస్తుంటారు. ఆ అవకాశం కోసం కనిపెట్టుకుని కాచుకుంటారు. అలాంటివి చేయకూడదు, ఒకరిమీద పెట్టి ఒకరిని నిందించే వారుంటారు. వ్యంగ్యార్థాలతో సన్నాయినొక్కులు నొక్కేవారుంటారు. నవ్వుతూ, నవ్వుతూనే అవతలివారిని కించబరిచేవారుంటారు. మరొకరి గురించి, చెడు చెప్పడంలో ఆనందించే వారుంటారు. ఇలాంటి వారి నుండి బయటపడాలి, మనస్సు ఎదుటివారి యెడల సౌమ్యస్థితిని పొందాలి. వారూ మనలాంటివారేనని తెలిసి తప్పొప్పుల పట్టికను ప్రక్కకు పెట్టి ప్రేమతో వారిని పలకరించడం మనకు చేతకావాలి. వారిలోని మంచివైపుకు చూస్తూ దానిని పెంచే మార్గాన్ని అన్వేషించాలి. వంకాయలాంటి దాంట్లో పుచ్చును తీసివేసి, మిగిలిన దానిని పుచ్చుకుంటున్నాం. మన తోటి మనిషి ఒక వంకాయపాటి కూడా చేయడా? ఆలోచించండి, తోటివారిని ఆదరించండి! మనవి కాని అంశాలయెడల మనస్సు మౌనాన్ని వహించడం మరొక అంశం. ఏది కర్తవ్యమో అది మనస్సు ముందు నిలుస్తూ ఉండాలి. కర్తవ్యం కానిది మనస్సునకు కనబడే స్థితి ఉండకూడదు. లోకంలో అనేక అంశాలు ఉంటాయి. అందులో మన కర్తవ్యానికి కావలసిన



అంశాలను మాత్రమే మనస్సు స్పృశించాలి. మిగిలిన అంశాల యెడల మౌనాన్ని పాటించాలి.

గిన్నెను పొయ్యిమీద పెట్టి, బిడ్డను గభాలున వెళ్లి కావలసిన నూనెను పట్టుకు రమ్మన్నది తల్లి. కొడుకు సీసా పట్టుకొని బయలుదేరాడు. కొద్ది దూరం నడిచేటప్పటికి అక్కడ గారడీవాడు గారడీ చేస్తున్నాడు. కుర్రవాడు అక్కడ నిలబడి పోయాడు. కాసేపటికి ఒక చేతిలో సీసా వ్రేలాడుతున్నది, మరొకచేతినేమో నోట్లో పెట్టుకొని ఆనందిస్తున్నాడు బిడ్డ. ఏ చీకూ, చింతా కనబడటం లేదు. ఇక్కడ గిన్నె మాడుతున్నది, నూనె రాదు. ఈ సన్నివేశంలో ఏం జరిగింది, కుర్రవాడి మనస్సు గారడీ యెడల మౌనాన్ని సహించలేక పోయింది. దానితో కర్తవ్యం మనస్సు నుండి జారిపోయింది.

మనలో ఎక్కువమందిలో జరుగుతున్నదిదే. కాని, అవసరంకాని అంశాలలో మనస్సు తేలియాడుతుందా! కర్తవ్యం కనుమరుగైపోతూ ఉంటుంది, కనుక మౌనం అత్యంత ఆవశ్యకం. ఏది మన జీవిత కార్యమో, దానియెడల మనస్సు నిలబడాలి. మిగిలిన వాటి యెడల మౌనాన్ని వహించాలి. అప్పుడు మాత్రమే మనం జీవిత కార్యాన్ని సాధించగలుగుతాం.

పైకి చూడడానికి అన్నీ పనులలాగానే కనబడతాయి. ఏదో చేస్తున్నట్లే ఉంటుంది. ఊరికే కూర్చున్నామా అనిపిస్తుంది. ఏదో జరుగుతున్నట్లే ఉంటుంది. సాధింపబడుతున్నట్లే కనబడుతుంది. కాని పరిశీలనగా చూడాలి! రోజు మొత్తం మీద మన కర్తవ్యం యెడల మనం ఎంత వరకు శ్రద్ధ కలిగి యున్నామో గమనించ గలగాలి. అప్పుడు తెలుస్తుంది. మనకు మౌనం ఎంతవరకు చేతనవుతున్నది అన్నది.

మౌనం మానసికమైనదే కాని కంఠగతమైనది కాదు, గొంతుతో మాట్లాడక పోవడం మౌనమని పించుకోదు. మన మునులందరూ చక్కగా మాట్లాడారు. విద్యార్థులకు పాఠాలు చెప్పారు, గ్రంథ రచనలు చేశారు. మునులు అంటే మౌనాన్ని వహించేవారు అని మనం అనుకుంటాం. వారు మానసికంగా తమవికాని అంశాల యెడల మౌనాన్ని వహించగలిగిన మహనీయులు. ఇది తెలియక కొందరు వారానికొకరోజు మాట్లాడడం మానేసి, మనస్సు పెట్టే గోలకు తట్టుకోలేక బాధపడుతుంటారు. చీటీల మీద వ్రాసిస్తూ ఉంటారు. చీటికిమాటికి సైగలు చేస్తూ ఉంటారు. ప్రక్క వాళ్లకు అవి తెలియక గోల చేస్తుంటారు. అదికాదు, ఇది అని సైగలు చేస్తూ తిప్పలు పడుతుంటారు.

మనస్సు మౌనం వహించాలి అంటే పంచేంద్రియాలు దాని వశంలో ఉండాలి. అలవోకగా అనాయాసంగా మనస్సు వాటిని తనలోనికి స్వీకరించగలిగి ఉండాలి. తాబేలును చూడండి! ప్రతికూల పరిస్థితులు వచ్చినపుడు తన అవయవాలను తనలోనికి ఠక్కున ముడుచుకుంటుంది.





పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని గమనించగానే మళ్లీ చరచరా నడిచిపోతూ ఉంటుంది. మనం ఆ తాబేలుగా ఉండాలి! ఇంద్రియాలు తాబేలు అవయవాలలా సమయాన్ని బట్టి మన మాట వినాలి. ఆ వినడం అనాయాసంగా జరగాలి. అప్రయత్నంగా జరగాలి. జరుగుతున్నట్లు తెలిసేలోపల జరగాలి. ఏ మాత్రం శ్రమ కలుగకూడదు. వ్యవధానం ఉండకూడదు. అలాంటి స్థితి అభ్యాసం కావాలి. సందోర్భోచితమైన ప్రవర్తన అన్నది అప్పుడే సాధ్యమవుతుంది. పాత్రపోషణ అప్పుడే రక్తికడుతుంది. ఈ శిక్షణ లేకపోతే కొంతదూరం వెళ్లిపోయాక గాని, దారి తప్పామని తెలియదు. అప్పుడు సర్దుకోవడం కష్టమవుతుంది. ప్రతిసారి సన్నివేశం ఇలా దారి తప్పుతోంది అనుకోండి, జరిగిన తప్పులు దిద్దుకోవడానికే జీవితం చాలదు. స్వధర్మాన్ని నిర్వహించేందుకు ఇక సమయముండదు.

మనస్సు సమయానికి తగినట్లుగా ఇంద్రియాలను నడపకపోవడం చేత ఇలాంటి ఇబ్బందులు వస్తూ ఉంటాయి. నడపడం చేతనయినకొద్దీ తప్పులు తగ్గుతాయి. కర్తవ్య నిర్వహణ జరుగుతుంది. కర్తవ్య నిర్వహణ జరుగుతున్న కొద్దీ మనస్సునకు తృప్తి దొరుకుతుంది. సత్యపథం అనుభవానికి వస్తుంది. దైవానుసంధానానికి దారి దొరుకుతుంది.

ఇంతవరకు చెప్పబడిన దివ్యమయిన లక్షణాలన్నీ మనస్సునకు అలవడాలీ అంటే మనస్సు పవిత్రమైన భావనలలో నిరంతరం తేలియాడుతూ ఉండాలి. మహనీయుల వాక్యాలు మనస్సులో మెదలుతూ ఉండాలి. వారి జీవిత సన్నివేశాలు నిరంతరం మనస్సు చేత స్మరింపబడుతూ ఉండాలి. దివ్యగాథలు, దివ్యబోధలు మనస్సును ఎల్లవేళలా పొదుగుతూ ఉండాలి. అప్పుడు ఆ మనస్సు నుండి వచ్చే ఆలోచనలు కూడా దివ్యమైనవై ఉంటాయి. సవ్యమైనవై ఉంటాయి. లోక శ్రేయస్సును ఒనగూర్చగలిగినవై ఉంటాయి. దేవుని ప్రణాళిక నుండి అందుకొంటున్నవై ఉంటాయి. అలాంటి దివ్యస్థితిలో మనస్సు తన తపస్సును కొనసాగించాలి!

అగరువత్తిని వెలిగిస్తే చుట్టుప్రక్కల వాతావరణం ఎలా పరిమళిస్తుందో మనకు తెలుసు. మంచి పూవు వికసిస్తే ఆ చుట్టుపట్టులు ఎంత ఆహ్లాదకరంగా రూపొందుతాయో మనకు తెలుసు. పవిత్రమైన భావనలతో తేలియాడుతున్న మానవుడు అలాంటివాడు. తన పరిసరాలను వెలుగులతో నింపగలిగినవాడు. తెలియని హాయిని ఆ ప్రాంతానికి చేకూర్చగలిగినవాడు. సుఖసంతోషాలతో ఆ పరిసరాలను పరవశింపచేయగలిగినవాడు. శాంతి సౌభాగ్యాలను అందించగలిగినవాడు. వారున్న చుట్టుపట్టుల ఏదో ఒక తెలియని తృప్తి అందరి మనస్సులకు అందుతూ ఉంటుంది. భావసంశుద్ధి వలన ఇంతటి పరమార్థం ఒనగూడుతుంది. ఇంతకంటే తపస్సు ఇంకేముంటుంది!



*– పార్థసారథి ప్రవచనాల నుండి*



## దిగంబరదాసు

"ఈ లోకాన నాకెవరున్నారు? మానవుడు ఈ విశాల సృష్టిలో నాది నాది అంటూ జీవితాన్ని గడుపుతాడు. కాని భగవంతుడు తప్ప సుఖ దుఃఖాలలో పాల్గొనువాడెవ్వడూ లేడు" అన్న ఆలోచనలో దాసు అంతఃకరణం జగదాంబ స్తోత్రం చేయసాగింది. వివాదే విషాదే ప్రమాదే ప్రవాసే, జలేచా నలే పర్వతే శత్రుమధ్యే అరణ్యే శరణ్యే సదామాం ప్రపాహీ గతిస్త్వం త్వమేకా భవానీ గురుః

"తల్లీ! ఎవరున్నారు నాకీ లోకాన? ఎవరున్నారు కుటుంబంలో నాకు తోడుగా? ఓ మాతా! వివాదంలో, విషాదంలో, ప్రమాదంలో, ప్రవాసంలో, జలం, అగ్ని, పర్వతం, అరణ్యం మరియు శత్రువుల మధ్య నన్ను రక్షించేది నీవే, నీవే నాకు దిక్కు. వేదశాస్త్రములన్నియు తెలిసినను, కవిత్వ శక్తి ఎంతయున్నను, సద్గురువు యొక్క చరణాలపై మనస్సు లేనిచో ఫలం శూన్యం. తల్లిదండ్రులు జన్మనిస్తారు, విముక్తిని కలిగించునది గురువే. నన్ను కన్నతల్లి నాకు అన్నం పెడుతుంది, నన్ను పోషిస్తుంది, రేయింబవళ్లు తోడుగా ఉండేది సద్గురువే కదా! దైవలీల విచిత్రమైనది. ఆయన ప్రతి పని వెనుక ఏదో ఒక కారణం ఉంటుంది. భగవంతుని దర్శించాలని దాసు లక్ష్యం. కాని, కేవలం భగవన్నామస్మరణ వల్ల లేక పస్తులుండడం వలన భగవంతుడు ప్రసన్నుడు కాడు, చిక్కడు కదా!

ఒక దినం దాసు భోజనం కోసం ఓ బ్రాహ్మణుని ఇంటికి వెళ్లాడు. దాసు తేజస్సు చూచి ఆ బ్రాహ్మణుడు ప్రభావితుడయ్యాడు. ఇద్దరూ పరమాత్మ గూర్చి చర్చించసాగారు. దాసుతో ఆ బ్రాహ్మణుడు ఇలా అన్నాడు "సోదరా! కేవలం భగవంతుని గుణగణాల్ని స్తుతించి, లేక అరచి భగవంతుడు దయాళుడని, పతిత పావనుడని, కరుణానిధి అని ప్రమాణ పత్రాన్నిచ్చిన మాత్రాన ప్రసన్నుడవుతాడా? ఇది వట్టి భ్రమ. ఇది అసలు, సిసలైన భక్తికాదు, నామ స్మరణ కేవలం మనశ్శాంతి కొరకే! నామ సంకీర్తనంతోపాటు దైవకార్య మొనర్చువాడే నిజమైన భక్తుడు". బ్రాహ్మణుని హితోక్తులు దాసు హృదయాన్ని ప్రభావితం చేసాయి. మర్నాటి నుండి గ్రామగ్రామానికి పోయి, ఇంటింటికి వెళ్లి దైవకార్యమొనర్చసాగాడు.

జనానికి దైవం గూర్చి, సంస్కృతి గూర్చి చక్కగా ఉపదేశించి, చక్కటి జీవితం గడిపే విధానాన్ని బోధించాడు. పళ్లెంలో ఆహారం వడ్డించిన తరువాత ప్రశాంతంగా ఒకటో, రెండో శ్లోకాలు పఠించి, ఏ భగవంతుడు ఈ పదార్థాన్ని సృష్టించాడో, ఎవరు వాటిని జీర్ణింపచేస్తారో, రక్తంగా మారుస్తారో, పోషిస్తారో, వారిని స్మరించి భుజించాలి. (బాబాతో ఋణానుబంధం పెంచుకోవడం ఎలా? ఏదైనా తినబోయేముందు, త్రాగబోయే ముందు బాబాను మనసారా స్మరించి, ఆ పదార్థాలు బాబా కొంత ఆరగించి, శేషం మనకు ప్రసాదంగా పెట్టినట్లు భావించుకోవాలి –***శ్రీబాబూజీ***).





నిద్రించునపుడు, నిద్రనుండి మేల్కొన్నపుడు, మనల్ని నిద్రింపచేయు వానిని, మేల్కొలుపువానిని స్మరించాలి. మనమే స్వయంగా నిద్రించలేము, మేల్కొలేము. భగవంతుడే మనల్ని నిద్రపుచ్చుతాడు, మేల్కొలుపుతాడు. దాసులో భక్తిభావముంది, దానికి కర్మయోగం కూడా అనుబంధమయ్యింది. ఒక దినం రాత్రివేళ ప్రశాంతంగా కూర్చొని, దైవస్మరణ కావిస్తూ, "ఓదేవా! వర్ణనాతీతం నీ శోభ, సాటిలేనిది నీ సృష్టి, నీవొసగిన శక్తిని నీ కార్యానికి వినియోగించాలని నా వాంఛ. అలా నీ దర్శనం పొందాలని నా తీవ్రమైన కాంక్ష" అంటూ నిదురించాడు.

అలా (భగవంతుని) స్వప్న దర్శనం లభించింది. అతని నయనాలు జలజల ఆనందాశ్రువుల్ని దాల్చాయి. అతని జీవితం సార్ధకమయ్యింది. "దాసు నీవు నా వాడివి, నీ అభిలాష ఏమిటో విన్నవించు". " భగవంతుడా! నీ దర్శనం పొందాను, ఇక ముల్లోకాల వైభవం కూడా తుచ్ఛమే, నాకు అధికారం, ఐశ్వర్యం, కీర్తి, ఏమీ అక్కరలేదు, నాకు కావలసింది సతతం నీ ముఖారవింద దర్శనం. నీ సేవాభాగ్యం, వాటి యందు నా చిత్తాన్ని ఏకాగ్ర పరచి నా జీవితాన్ని వికసింపచేసుకొని నీకు సమర్పించుకుంటాను. అసమాన్య జీవితాన్ని గడపదలచుకొన్న దాసు ఇప్పుడు సామాన్యుని వలె గడపసాగాడు. ఇదియే అతని వికాస జీవితం. ఒక సందర్భంలో దాసు తన కుటుంబంతో కలసి గోయి అనే గ్రామానికి వచ్చారు. గ్రామ పొలిమేరలో వున్న తటాకం వద్ద విడిది చేసారు. వారి కట్టు, బొట్టు చూసి సామాన్యులు వారిని భిక్షకులు అని భావించారు.

ఆ గ్రామంలో సీతోపంత్ కులకర్ణి అనే విద్యాగరిష్టుడైన బ్రాహ్మణుడున్నాడు. అతడు సద్భావం కలవాడు. అంధ విశ్వాస రహితుడు, నిష్టాపరుడు. ఎవరిముందర తలవంచేవాడు కాదు, వాహ్యాళికి వెళ్లినపుడు దాసుతో పరిచయం కలిగింది. కాని అతనికి ఇతడు దిగంబరదాసు అని తెలియదు. కులకర్ణి సంభాషణ సందర్భంలో దాసుని పెక్కు ప్రశ్నలు వేసాడు, వాటికి తక్షణమే జవాబు లభించింది. ఇంతవరకు అతనికి ఏ ప్రశ్నలకు జవాబు చిక్కలేదో వాటికి నేడు దాసు దగ్గర లభించింది. అలా ప్రభావితుడయ్యాడు. అప్పుడుమీరు ఎవ్వరో సెలవియ్యగలరా అన్న కులకర్ణితో... 'దిగంబరదాసు'ని అని క్లుప్తంగా సమాధానమిస్తారు. కులకర్ణి ఆశ్చర్యచకితుడవుతాడు. దాసు ఖ్యాతి వినివున్నాడు. రాజాశ్రయాన్ని కాలదన్ని, వేలాదిమంది మానవుల జీవితాన్ని తీర్చిదిద్దిన గొప్ప దైవభక్తుడు ఇతడేనా, జన్మాంతం వరకు ఎవరికీ తలవంచనని నిర్ణయించుకున్న ఆ సీతోపంత్ కులకర్ణి – దాసు చరణాలపై తలవంచాడు. "మహాత్మా! మీ జ్ఞానం, భక్తి, మీ సేవ అసామాన్యమైనవి. మీలాంటి మహావ్యక్తి ఇలాంటి సామాన్య స్థితిలో ఉండడమా?" "ప్రభూ! నేనింత వరకు ఎవరినీ గురువుగా స్వీకరించలేదు, నాకు దొరికిన వారల్లా నిస్తేజులు, భగవంతునితో బిచ్చుంకై ప్రార్ధించేవారు. మీరు మహనీయులు, మీరు వేదాల్ని అక్షరాలా పాటించారు. మీ భక్తి





అనన్యం. నేను మిమ్మల్ని నేటి నుండి గురువుగా స్వీకరిస్తున్నాను". "సీతోపంత్! మీరు మహనీయులు, నేను ఎవరికీ గురువును కాను, గురువుగా కాదలచుకోలేదు. ఒకరికి గురువై వారి భారాన్ని మోసే సామర్థ్యం నాలో లేదు" అంటూ దాసు వినయంగా పలికాడు. "ప్రభూ! గురువు తయారుచేయబడడు, స్వయంగానే సిద్ధమవుతాడు, భగవంతుని తరువాత ఏ వ్యక్తి తన హృదయానికి నచ్చునో, అతడే 'గురువు'. అందుచేత మీరు నా గురువులు. మీరు ఏదైనా వ్రాయడానికి పూనుకుంటే సరస్వతి తల్లి కూడా తనను ధన్యురాలిగా భావిస్తుంది" అంటాడు. సీతోపంత్ తన యావత్ సంపదను దిగంబరదాసు పాదపద్మములయందు సమర్పించాడు.

కర్మ, భక్తి, జ్ఞాన, త్రివేణి సంగమంలాగ జీవించిన ఈ మహాపురుషుని జీవితాంతం భగవత్కార్యాలలో గడిపాడు. గీతార్ణవ (లక్షాపాతిక సూక్తుల గ్రంధం) ద్వారా దైవ సంబంధమైన వాఙ్మయాన్ని అభివృద్ధి చేసారు. గ్రంధావిష్కరణం స్వతంత్ర్య భారత రాష్ట్రపతి కరకమలముల ద్వారా జరిగింది. మాఘమాసం బహుళ షష్ఠినాడు మానవలోకానికి వెలుగునిచ్చే భాస్కరునివలే దేదీప్యమానంగా వెలిగిన ఆ మహాభక్తుడు మానవ జీవితమును ప్రకాశింపచేసి, తిరిగి భగవానుని యందే లీనమయ్యాడు. ఆ మహాత్మునికి కోటి ప్రణామములు.

ఒకరోజు మథుర్ గురుదేవులతో ఇలా అన్నాడు "భగవంతుడు సైతం తన శాసనాలను ఉల్లంఘించలేదు. ఒక శాసనం అమలు పరచిన తరువాత ఆయన కూడా ఆ శాసనాన్ని అతిక్రమించలేదు". అందుకు శ్రీరామకృష్ణులు ఇలా అంటున్నారు. "ఏమంటున్నావు? ఆయన తలచుకొంటే తాను అమలు పరచిన శాసనాన్ని రద్దు చేయగలడు లేదా అందుకు బదులుగా మరొక శాసనాన్ని అమలు చేయగలడు."కానీ మథుర్ ఈ అభిప్రాయాన్ని వ్యతిరేకించి, "ఎర్రపూవులు పూచే చెట్టు ఎర్ర పువ్వులను మాత్రమే పూస్తుందని, ఎన్నటికీ తెల్లపువ్వులు పూయదని ......... శాసనం చేసాడు. ఎర్ర పువ్వులు పూచే చెట్టున ఒక్క తెల్లపువ్వును పూయించమనండి చూద్దాం" అన్నాడు మథుర్. "అవును, ఆయన ఏదన్నా చేయగలడు – ఇది కూడా" అన్నారు దృఢంగా శ్రీరామకృష్ణులు. మర్నాడు దేవదారు వనానికి పోతున్నపుడు ఒక ఎర్రమందార చెట్టు ఒకే కొమ్మకు ఒక ఎర్రని పువ్వు, మిరుమిట్లుగొల్పే ఒక తెల్లనిపువ్వు పూచివుండడం శ్రీరామకృష్ణులు చూసారు. వెంటనే ఆయన ఆ కొమ్మను విరిచి మథుర్ వద్దకు తీసుకువెళ్లాడు. అది చూసి మథుర్ విస్తుబోయి, "అవును బాబా! నేను ఓడిపోయాను" అన్నాడు.

సాయి సమగ్రదర్శిని : **www.saibaba.com**
సద్గురు తత్త్వ దర్శిని : **www.gurukrupa.info**
గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : **gurukrupa@saimail.com**





నా గురువు నన్నిలా ఆశీర్వదించారు.
'నీవెక్కడున్నా సరే - ఇక్కడగాని, సప్త సముద్రాలకావలగాని
నేనెప్పుడూ నీ వెంటనే వుంటాను! తాబేలు తన మనో నేత్రంతోనే
తన బిడ్డలనెలా రక్షిస్తుందని చెబుతారో అలాన్నే,
నేను నా (మనో) దృష్టి చేతనే నిన్ను కాపాడుతాను!' అని.
ఈనాటి నా యీ ప్రతిభకంతకూ కర్తలు వారే! ఆయన ఆశీస్సుల ఫలితమే ఇదంతా!"
ఇది అనాదిగా, అనుశ్రుతంగా వస్తున్న ఆధ్యాత్మిక సాంప్రదాయం, ఆదర్శం కూడా!

- సాయిభక్తి సాధన రహస్యం.


సాయిబాబా.. సాయిబాబా... సాయిబాబా..
...సాయిబాబా... సాయిబాబా.. సాయిబాబా...
నిరతము నీ పాద ధ్యానమే!
నిరతము నీ నామ గానమే!
నిరతము నీ పాద ధ్యానమే!
నిరతము నీ నామ గానమే!